ప్రజాశక్తి
శనివారం 25 ఫిబ్రవరి 2023
I
అల్లూరి సీతారామరాజు

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం ఎస్ఐ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల ముమ్మర తనిఖీలు నిర్వహించారు. త్రిపుల్ రైడింగ్, అతివేగంగా నడుపుతున్న 35 వాహనాలపై అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా వాహనదారులకు, యువతకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంజిత్ కుమార్ మాట్లాడుతూ, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ,డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని తెలిపారు. హెల్మెట్లు ధరిస్తే ప్రమాదాల తీవ్రత తగ్గుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

-పాడేరు ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ - స్పందనలకు 85 వినతులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతలు వెల్లు వెత్తాయి. ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, జెసి జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 85 వినతులు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి భూ సమస్యలు పరిష్కరించాలని 16 వినతలను అర్జీదారులు సమర్పించారు. సామాజిక సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, తాగునీటి సదుపాయాలు, రోడ్డు సౌకర్యాలు వంటి అంశాలపై 69 ఫిర్యాదులు అందాయి. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పిఒ అదేశించారు.

గిరిజనుల నుండి వినతలు స్వీకరిస్తున్న పిఒ

స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులు

చింతపల్లి మండలం పెదబరడ పంచాయతీ సిరిపురం గ్రామస్తులు బి.రమణమ్మ, బి.కొండమ్మ, కె.బాలయ్య తదితర పివిజిటిలు 2020లో తమ ఆధీనంలో ఉన్న అటవీ భూములపై సర్వే చేసారని, అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. జికె.వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ మెట్టగూడ గ్రామస్తులు జి.కామేశ్వరరావు, జి.రాజు, పి.రవి తదితరులు లక్కవరం నుండి మెట్టగూడ వరకు రోడ్డు నిర్మించాలని, గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అరకు వేలీ మండలం చినలబుడు పంచాయతీ మాలిసింగారం గ్రామస్తుడు ఎం.దాసు అరకు రైల్వే ఇంజనీరింగ్ ఆఫీసు ఎదురుగా ఉన్న ఐటిడిఎ దుకాణ సముదాయంలో దుకాణం కేటాయిస్తే రైతులకు ఉపయోగపడే విధంగా విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు షాపు పెడతానని వినతిపత్రంలో పేర్కొన్నారు. పెదబయలు మండలంకు చెందిన పి.ప్రసాదు పాడేరు నుండి విశాఖపట్నం రహదారిలో మోదకొండమ్మ అమ్మవారి పాదాల నుండి గరికిబంద వరకు ఘాట్ రోడ్డులో రక్షణ గోడలు నిర్మించాలని కోరారు. హుకుంపేట మండలం ములియాపుట్టు గ్రామంలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ. 7 లక్షలతో తాగునీటి పథకం నిర్మించారని తగిన నాణ్యతలు పాటించలేదని గ్రామస్తులు కె.రామస్వామి, ఎస్.గంగాధర్, ఆర్.బుజ్జిబాబు ఫిర్యాదు చేసారు. జికె వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ జర్రెల బంద బుగ్గలోని గ్రామానికి ఈత రొబ్బలు గ్రామం నుండి మూడున్నర కిలో మీటర్ల రోడ్డు నిర్మించాలని జి.అశోక్, కె.బాబు వినతి పత్రం సమర్పించారు. ముంచింగిపుట్టు మండలం జర్రెల పంచాయతీ దాసంపుట్టు గ్రామం నుండి జర్రెల గ్రామం వరకు మిషన్ కనెక్ట్ పాడేరులో రోడ్డు మంజూరు చేసారని పనులు ప్రారంభించాలని సర్పంచ్ నాయకం భాగవతి కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ ఐ.కొండలరావు, ఇఇ డివిఆర్ఎం రాజు, డిఎంహెచ్ఒ డా.జమాల్ భాషా, పిఆర్ పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, డిఎల్ పిఒ పిఎస్ కుమార్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి, ఆర్ అండ్ బి ఇఇ బాలసుందర బాబు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి..

40 మంది నామినేషన్లు ఆమోదం

- నలుగురివి తిరస్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం): ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను విశాఖ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్ సమక్షంలో అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 16న నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి చివరి రోజు గురువారం వరకూ 44 మంది 70 సెట్లు నామినేషన్లు దాఖలు చేయగా వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వాటిలో నాలుగు నామినేషన్లను తిరస్కరించారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇమామ్ మోహియుద్దీన్ అహ్మద్, రుద్రరాజు కల్యాణ వర్మ, విజయనగరం జిల్లాకు చెందిన బొలిశెట్టి వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లాకు చెందిన కొలుపురి నాగభారతి నామినేషన్లను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి మల్లికార్జున తెలిపారు. ఈ నెల 27 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. నామినేషన్ల పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస్‌మూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సిబ్బంది, నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఉన్నారు.

నామినేషన్ల పరిశీలనలో పాల్గొన్న ఎన్నికల అధికారులు, ఎమ్మెల్సీ అభ్యర్థులు

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయంపై సిపిఎం నిరసన

★ ఎపికి ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్
★ ధాన్యం కొనుగోలు, తునికాకు సేకరణ, పోలవరం పరిహారం, పునరావాసం. రోడ్లు, తాగునీటి సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-చింతూరు

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మోడీ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం ఐటిడిఎ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీనికి ముందు ఎర్రంపేట నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని, విభజన హామీలను అమలు చేయాలని, నాలుగు మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని, తునికాకు ప్రూనింగ్ పనులు తక్షణమే చేపట్టాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. విలీన మండలాల పర్యటనలో భాగంగా చింతూరు ఐటిడిఎకు విచ్చేసిన అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆందోళన వద్దకు వచ్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎటపాక మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు తదితరులు కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. ధాన్యం కొనుగోలు సరిగా చేపట్టకపోవడంతో ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పశువులు పాలవుతున్నాయని తెలిపారు. ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి, డబ్బులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రూ.10,376 కోట్లు డబ్బులు పడ్డాయని, త్వరలో మరో రూ.10 కోట్లు పడతాయని తెలిపారు. గతేడాది ధాన్యం కొనుగోలుకు సంబంధించి కమీషన్ డబ్బులు నేటికీ పడలేదని తెలియజేయగా, త్వరలోనే ఆ డబ్బులు కూడా పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలవరం పరిహారం, నిర్వాసితులకు పునరావాసంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలియజేయగా, వాటన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు రెండవ పంటగా ఉన్న తునికాకు సేకరణ చేపట్టలేదని తెలిపారు. పక్క రాష్ట్రంలో కట్టకు రూ.5 చొప్పున వెలకట్టి తక్షణమే డబ్బులు చెల్లిస్తున్నారని, మన దగ్గర కట్టకు సగం రేటు కూడా ఇవ్వడం లేదని, పైగా సంవత్సరాల తరబడి డబ్బులు పెండింగ్‌లో ఉంచుతున్నారని సిపిఎం నాయకులు తెలిపారు. గ్రామాల్లో రోడ్డు సౌకర్యం సరిగా లేదని, గోదావరి వరదలకు ఏర్పడిన సమస్యలు కొన్ని ప్రాంతాల్లో ఇంకా అలాగే ఉన్నాయని చెప్పారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి రెండు రోజులపాటు ఇక్కడే ఉంటున్నానని, ఈలోగా ఈ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, వడ్లది రమేష్, పల్లపు వెంకట్, గిరిజనులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని వినతి

విఆర్.పురం : విఆర్.పురం మండలంలోని శ్రీరామగిరి, చింతరేవుపల్లి, పెద్దమట్టపల్లి ఎంపియుపి స్కూళ్లతో పాటు వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 45 ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎంపిపి కారం లక్ష్మి ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు శుక్రవారం చింతూరు ఐటిడిఎ వద్ద వినతి పత్రం అందించారు. విఆర్.పురం జెడ్పి హైస్కూల్, సున్నంవారి గూడెం ఆశ్రమ పాఠశాల, సోములగూడెం ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులు, రేఖపల్లి జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌ను నియమించాలని కోరారు. పెద్ద మట్టపల్లి నుండి నర్సింగ్ పేటకు, గుల్లేటివారుకు, కుందులూరు నుండి టేకులూర్‌కు, మొలకలపల్లి నుండి వీర పాపన్న కుంటకు తారు రోడ్లు వేయాలని, కుందులూరు నుండి జల్లువారిగూడెం వరకు గ్రావెల్ రోడ్డును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు మంజూరు చేయాలన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, లక్ష్మణరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

కలెక్టర్ సుమిత్ కుమార్‌కు సమస్యలను తెలియజేస్తున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్ పావని

హాజరైన ఎస్ఎఫ్ఐ నాయకులు

నూతన విద్యా విధానంతో ..

గిరిజన విద్యార్థులకు తీవ్ర నష్టం

ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.పావని

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:

నూతన ఎడ్యుకేషన్ పాలసీతో గిరిజన ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్ పావని తెలిపారు. అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన అరకు వేలి గిరిజన సంఘం కార్యాలయంలో మూడు రోజుల పాటు జరగనున్న విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులకు శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో సుమారు 87 పాఠశాలలు మూసివేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన చాలా దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను వ్యాపారంగా మార్చిందన్నారు. గిరిజన పేద విద్యార్థులకు ఉన్నతమైన చదువు అందనీయకుండా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం చేస్తున్నామని ధ్వజమెత్తారు. సమాజాభివృద్ధికి శాస్త్రీయ విద్యా విధానం, సైన్స్‌ను అభివృద్ధి చేయకుండా బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు అడ్డుకుంటున్నాయని చెప్పారు. ఉచిత నిర్బంధ విద్య అందించవలసిన ప్రభుత్వాలు వివిధ రకాల పేర్లతో ప్రభుత్వ పాఠశాలను మూసి వేస్తున్నాయని విమర్శించారు. అరకులోయ మహిళా డిగ్రీ కళాశాలలో కనీస సిబ్బంది లేకుండా కేవలం ఒక ప్రిన్సిపాల్‌తో కళాశాల ప్రారంభించారని, నేటికీ పూర్తి స్థాయిలో అధ్యాపకులు నియమించకపోవడం సిగ్గు చేటన్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల మరణాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, తక్షణమే హెల్త్ అసిస్టెంట్‌లను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులకు గతంలో కాస్మోటిక్ చార్జీలు ఇచ్చేవారని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఒడి పేరుతో ఒక కుటుంబానికి ఒక విద్యార్థికి మాత్రమే చెల్లిస్తూ మిగితా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్య వ్యవస్థలో భవన, యూనివర్సిటీ ఫీజులతో పేద విద్యార్థులను దోపిడి చేస్తున్నారన్నారు. నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడి మన హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జీవన్, జిల్లా సహాయ కార్యదర్శి జి.చిన్నారావు, జి.కార్తీక్, అరకువేలి మండల ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ఎస్.గంగమ్మ, మండల నాయకురాలు పుష్ప, ఎస్ఎఫ్ఐ అరకువేలి మండల అధ్యక్షులు కె.సిమోన్, కార్యదర్శి పి.సరేంద్ర, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మించరూ..

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో బోయితిలి పంచాయతీ కేంద్రంలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టాలని మాజీ సర్పంచ్ రాంబాబు, మాజీ ఎంపీటీసీ బ్రహ్మలింగం కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పంచాయతీలో మారుమూల గ్రామాలకు సైతం జియో, ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణం చేపట్టి పలుచోట్ల సిగ్నల్స్ అందుబాటులో ఉందన్నారు. పంచాయతీ కేంద్రంలో సెల్ టవరు నిర్మాణంలో జాప్యం జరగడంతో బొయితిలి పంచాయతీ కేంద్రంలో సచివాలయంలో ఆన్‌లైన్ సేవల నిమిత్తం సిబ్బంది పక్క గ్రామానికి వెళ్లాల్సి వస్తుందన్నారు.బోయితిలి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పులుసు మామిడి గ్రామంలో జియో సేవలు అందుబాటులో ఉండటంతో ఆ గ్రామానికి వెళ్లి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని పంచాయతీ కేంద్రంలో సెల్ టవర్ నిర్మాణ పనులు జరిగే విధంగా చూడాలని వారు కోరారు. ఈ సమావేవంలో పిసా చట్టం అధ్యక్షుడు లక్ష్మణరావు, వార్డు మెంబర్ గంగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

50 రోజుల్లో మౌలిక సదుపాయాలు

★ చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
★ వైద్యాధికారులతో సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటానికి అవసరమైన మౌలిక సదుపాయాలు 50 రోజుల్లో కల్పిస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిని సందర్శించి అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, చిన్నపిల్లలు, కళాశాల విద్యార్థులకు రక్తహీనత రాకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రక్తహీనత నిర్మూలనకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశ, అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారుల సహకారంతో విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చింతూరు ఆసుపత్రిలో బ్లడ్ డొనేషన్ కేంద్రాన్ని బ్లడ్ బ్యాంకుగా మార్చటానికి త్వరలో ప్రతిపాదనలు పంపుతామన్నారు.

గర్భిణుల వైద్యానికి అవసరమైన పరికరాలు సమకూరుస్తామని, ఎముకల డాక్టర్లకు అవసరమైన ఎక్స్‌రే ప్లాంట్ రిపేరు చేస్తామని తెలిపారు. ఫ్రాక్చర్ టేబుల్ సిఆర్ఎమ్ సిస్టం కోసం రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. ఇఎన్‌టి వైద్యులకు కావలసిన పోర్టబుల్ ఎండోస్కోపీని వెంటనే కొనుగోలు చేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ పుల్లయ్యను ఆదేశించారు. అత్యాధునిక మూడు బెడ్లను ఎస్ఎంసిలో కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ మరమ్మతులు చేపట్టాలన్నారు. చిన్నపిల్లలకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వెయిటింగ్ హాల్, తగిన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. గతంలో లాగా రోగులను భద్రాచలం రిఫర్ చేసే అవకాశం లేకుండా ఇక్కడే అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ పుల్లయ్య, గైనిక్ డాక్టర్ శశికళ, ప్రత్యేక వైద్యులు పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

రక్తహీనత నివారణకు మందులు

- బాలబాలికలకు వైద్య పరీక్షలు చేయాలి
- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలో వివిధ పాఠశాలలలో చదువుచున్న బాలబాలికలకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి, సంబంధిత మందులు అందజేయాలని ఎడిఎంహెచ్ఒ డాక్టర్ అనూషను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో పిఒ మాట్లాడుతూ ఎనీమియా ముక్తి భారత్ ప్రోగ్రామ్ ద్వారా ఏజెన్సీలోని అన్ని ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఈ వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. బాలబాలికలకు రక్తహీనత ఉంటే ఆయా ఆశ్రమ పాఠశాలలో మెరుగైన పౌష్టికాహారం అందించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఎక్కువగా రక్తహీనత ఉన్నవారికి బ్లడ్ ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ నిబంధన ప్రకారం ఆహార పదార్థాలు తాజాగా అందించాలన్నారు. విద్యార్థులు ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే ప్రధానోపాధ్యాయులు వార్డెన్లు వెంటనే స్పందించి దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకొని వెళ్లి తగు వైద్యం చేయించాలని సూచించారు. విద్యార్థుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని అంతాడా పంచాయతీ శివారు తాటిమనిపాలెంలో ఈ నెల 22న జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఏడు కుటుంబాలకు స్థానిక ఎంపీటీసీ ఇరవాడ సత్యవాణి శుక్రవారం ఆర్థిక సహాయం, నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయంతో పాటు స్కీం ఇళ్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఇరవాడ దేవుడు, ఉల్లి సత్యనారాయణ, నానాజీ, మొల్ల నాగరాజు, పొట్టకూరిదార మల్లేష్, గుమ్మ రాంబాబు, పాంగి విజయ్ కుమార్, పాంగి ఓలయ పాల్గొన్నారు.

లోకుల గాంధీ ట్రస్టు ఆధ్వర్యాన

తాటిమనిపాలెం అగ్ని ప్రమాద బాధితులకు లోకుల గాంధీ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ మఠం మురళీకృష్ణ బియ్యం, కూరగాయలు, నిత్యవసరం సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రీమల చంద్రరావు, అర్జున్ రెడ్డి, సర్పంచ్ సుర్ల చంద్రరావు పాల్గొన్నారు.

బియ్యం, ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపిటిసి సత్యవాణి తదితరులు

పాఠశాలలు మూసేయొద్దు!

గిరిజన సంఘం ఆధ్వర్యాన తల్లిదండ్రుల ఆందోళన

మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్న నాయకులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని వర్రతోకవలస, టిడిగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు కొనసాగించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యా శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నాయకులు, విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, నాయకులు కె రామారావు మాట్లాడుతూ, పాఠశాలలు విలీనం చేసి మూసి వేయడంతో గిరిజన పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతారన్నారు. మండలంలోని వర్రతోకవలస, టిడిగుడ పాఠశాలలను కొనసాగించి గిరిజన విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని చెప్పారు.

విద్యార్థులకు చదువు నుండి దూరం చేసే ఆలోచన విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వెనకబడిన గిరిజన ప్రాంతంలో ప్రతి ఒక్కరికి చదువు అందించాలంటే విలీన ప్రక్రియను ఆపాలన్నారు. ఏజెన్సీలో విలీనం పేరుతో పాఠశాలలు మూసివేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు జి.అర్జున్, టొంకో, క్రిష్ణ, కె రామస్వామి, మహేష్, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్

జిల్లా అధ్యక్షునిగా విజయ్ కుమార్

విజయకుమార్

ప్రజాశక్తి- అరకులోయ : అల్లూరి సీతారామరాజు జిల్లా క్రిస్టియన్ మైనారిటీల సెల్ అల్లూరి జిల్లా అధ్యక్షుడిగా అరకు నియోజకవర్గం వర్గం అరకులోయ మండల కేంద్రానికి చెందిన బిషప్ డాక్టర్ మొస్య విజయ్ కుమార్ డానియల్ మోడీని నియమిస్తూ వైసిపి పార్టీకార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పలువురు క్రైస్తవ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ, తనను నమ్మి పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, అల్లూరి జిల్లా ఇంచార్జి, పాడేరు శాశనసభ్యురాలు కె.భాగ్యలక్ష్మి, అరకు శాశనసభ్యులు చెట్టి ఫాల్గుణలకు కృత్షతలు తెలిపారు. పార్టీ విధి విధానాలను అనుసరించి పార్టీ భలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

26న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో ఈనెల 26న ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు పాడేరు సిఐటియు కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యుడు శెట్టి నాగరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హుకుంపేట, పాడేరు, జిమాడుగుల మండలాల పరిధిలోని ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, ఇటీవల కాలంలో కాంట్రాక్టు ఉద్యోగుల మరణాలు, భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చిస్తామని తెలిపారు.

సమస్యలపై ప్రశ్నించే గొంతును గెలిపించండి

విస్తృత ప్రచారంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం) : పట్టభద్రుల, ప్రజా సమస్యలపై చట్టసభలో ప్రశ్నించి, పరిష్కారానికి కృషి చేసేందుకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం ఎంవిపి హెల్త్ ఎరీనాలో ఆమె ప్రచారం చేపట్టారు. పట్టభద్రులతో మాట్లాడారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజలను మాటలతో మోసం చేస్తున్నాయన్నారు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నించటం లేదన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మూడున్నరేళ్లుగా ఒక్క నోటిఫికేషనూ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రశ్నించే గొంతుకగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పిడిఎఫ్ బృందం ఆర్‌కెఎస్‌వి.కుమార్, రాజేశ్వరరావు, యుఎస్ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు, అష్రఫ్, చంటి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భీమిలిలో పట్టభద్రులను కలిసి ప్రచారం చేస్తున్న రమాప్రభ

పిడిఎఫ్ ఎమ్మెల్సీ వారసత్వాన్ని కొనసాగిస్తా

భీమునిపట్నం: పిడిఎఫ్ అంటేనే విద్యావంతుల అభిప్రాయాలను శక్తివంతంగా, స్వతంత్రంగా వినిపించే వేదిక అని, తాజా, మాజీ పిడిఎఫ్ ఎమ్మెల్సీల వారసత్వాన్ని కొనసాగిస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీనిచ్చారు. శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఓటర్లను కలిసి, మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో సిఐటియు జోన్ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి, మండల నాయకులు ఎస్ అప్పలనాయుడు, డి.బాబాజీ, ఐద్వా నాయకులు కె నాగరాణి, ఎస్.గున్న, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి కాలనీలో ప్రచారంలో పాల్గొన్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ


రమాప్రభకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్న ఐఆర్‌టి రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్

ఐఆర్‌టి ఉపాధ్యాయుల సంపూర్ణ మద్దతు

పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామంలో పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ శుక్రవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఆర్‌టి ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజకుమార్ హంసను కలిశారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలో ఐఆర్‌టి ఉపాధ్యాయులంతా పిడిఎఫ్ వెంటే ఉన్నారని, గత ఎన్నికల్లోనూ పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ఓట్లేశామని, ఈ సారికూడా పిడిఎఫ్‌కు సంపూర్ణ మద్దతుగా ఉంటామని ప్రకటించారు. పిడిఎఫ్ అభ్యర్థిగా రమాప్రభ ప్రచారానికి వెళ్లే ప్రాంతాలకు సంబంధించిన సమాచారం తమకు ఇస్తే అక్కడి ఐఆర్‌టి ఉపాధ్యాయులంతా ప్రచారంలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నేత ఆర్ఎస్ఎన్ మూర్తి ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బోగస్ కుల ధ్రువీకరణలు రద్దు చేయాలి

మాట్లాడుతున్న రామారావుదొర,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: నకిలీ ఎస్‌టిల ధ్రువపత్రాలు, ఒసి కాపులకు ధ్రువపత్రాల జారీని రద్దు చేయాలని ఎపి ఆదివాసి హక్కుల పరిరక్షణ జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర కోరారు. ఈ మేరకు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణకు ఐటిడిఎ స్పందనలో కలిసి వినతి పత్రం అందజేశారు. గిరిజనుల హక్కులు, చట్టాల ఉల్లంఘన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంత హక్కులు, చట్టాలపై అధికారుల నిర్లక్ష్యంపై రాష్ట్రపతి, సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అరకులోయ, డుంబ్రిగూడ, అనంతగిరి, కొయ్యూరు మండలాల్లో ఎస్‌టి-కొండకాపు తెగగా చలామణి అవుతూ ఎస్‌టి రిజర్వేషన్ ఫలాలు, సంక్షేమ పథకాలు అక్రమంగా అనుభవిస్తున్న ఒసి-కాపులకు ఏజెన్సీలో కుల ధ్రువపత్రాల జారీని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా గెజిట్ లో కొండకాపు తెగ లేనప్పటికీ మండల స్థాయి రెవెన్యూ అధికారుల చేతివాటంతో ఒసి కాపులకు ఎస్ టి-కొండకాపులుగా ధ్రువపత్రాలు జారీ అవుతుందని ఆరోపించారు. ఎస్ టి-కొండకాపు ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిని ఉద్యోగాల నుండి తొలగించాలని డిమాండ్ చేసారు.

పెట్రోల్ బంక్ పరిశీలన

ప్రజాశక్తి-జి.మాడుగుల మండల కేంద్రం హెచ్పిసిఎల్ (లో జిసిసి అనుబంధం) పెట్రోల్ బంకును శుక్రవారం హెచ్పిసిఎల్ సేల్స్ ఆఫీసర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పెట్రోలు, డీజిల్ కొలతలను పరిశీలించారు. పెట్రోల్; డీజిల్ ఎల్లప్పుడూ లబ్ధిదారులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట పెట్రోల్ బంకు ఇంచార్జ్ సింహాచలం, శివకుమార్ ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులతో స్పెషల్ ఆఫీసర్

ప్రజాశక్తి- హుకుంపేట: 10 తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిణులు ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకొని రావాలని కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జయప్రద ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల వద్ద 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఫేర్వెల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినుల థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కేజీబీవీ ఎస్ఓ మాట్లాడుతూ, పరీక్షల్లో భయం వదిలి ధైర్యంగా రాయాలని ఆమె సూచించారు. పరీక్ష సమయంలో విద్యార్థినిలు ఎటువంటి సమస్యలు, ఒత్తిడిలకులోను కాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిందితులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పెదబయలు: గంజాయి కేసుల్లో పట్టుబడి బెయిల్ పై బయటికి వచ్చిన నిందితులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-జిమాడుగుల: పాడేరు నుండి జి.మాడుగుల ప్రయాణికులతో వస్తున్న జీపు బంధ వీధి వెన్నెలమ్మ తల్లి ఘాటు వద్ద స్టీరింగ్ ఆకస్మికంగా వదిలేయడంతో అదుపుతప్పి రక్షణ గోడను ఢీ కొంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. జీపులో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పాత్రికేయులకు బెదిరింపులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో 1/70 భూ బదలాయింపు చట్టానికి వ్యతిరేకంగా అక్రమ కట్టడాలు నిర్మించుకున్న వార్తలు ప్రచురిస్తున్న స్థానిక పాత్రికేయులపై గిరిజనేతరులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు ఎటువంటి శాశ్వత గృహ నిర్మాణాలు చేపట్టకూడదు. అమ్మకాలు జరపకూడదు. కొనుగోలు చేయకూడదని చట్టంలో ఉంది. దానికి భిన్నంగా చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్ప డుతున్నారు. ఆ చట్టాన్ని ధిక్కరించి శాశ్వత గృహ నిర్మాణాలు, షాపులు విచ్చలవిడిగా మండల కేంద్రంలో నిర్మించు కుంటున్నారు. దీనిపై గిరిజన పాత్రికేయులు వార్తా కథనాలు ప్రచురిస్తుండటంతో సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు గిరిజనేతరులకు నోటీసులు పంపుతూ అక్రమ కట్టడాలను నిలుపుదల చేయడానికి సిద్ధమయ్యారు.

దీంతో పాత్రికేయులపై గిరిజనేతరులు బెదిరింపులకు దిగుతున్నారు. దీనికి తోడు ఇకనుంచి వార్తలు ప్రచురిస్తే మీ సంగతి చూస్తాం అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గిరిజన సంఘాలు, పాత్రికేయ సంఘాలు, 1/70 చట్టం పరిరక్షణ కమిటీ, అఖిలపక్షం కమిటీ, ప్రజాప్రతినిధులు తీవ్రంగా ఖండించాలని పాత్రికేయులు కోరుతున్నారు. పత్రిక స్వేచ్ఛ ను హరించే హక్కు గిరిజనేతరులకు లేదని పాత్రికేయులు స్పష్టం చేశారు

3న బహిరంగ వేలం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విశాఖ, చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్స్ మాక్స్ ఆధ్వర్యంలో మార్చి 3న కాఫీ బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి జిల్లా కలక్టరేట్ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు బహిరంగ వేలం పాటలో పాల్గొని కాఫీని కొనుగోలు చేయవచ్చని తెలిపారు. మాక్స్ అధీనంలో 135.25 మెట్రిక్ టన్నుల కాఫీ పార్చ్మెంట్, 17.60 మెట్రిక్ టన్నుల కాఫీ ఫ్లోట్ చెర్రీ స్టాక్‌కు వేలం పాట జరుగుతుందని, వేలం పాటలో పాల్గొనదలచిన వారు తిరిగి వాపసు చేయబడని రూ.5 వేలు ఎంట్రెన్స్ ఫీజు చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు. చింతపల్లి పల్పింగ్ యూనిట్ వద్ద ఉన్న స్టాకును పరిశీలించుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించి నియమ నిబంధనలు, సెక్యూరిటి డిపాజిట్ ఇతర వివరాలకు పోన్: 7569118491, 9440803572 నంబర్లకు సంప్రదించవచ్చని సూచించారు.

అల్లూరి విగ్రహావిష్కరణలో పాల్గొన్న సేవా కమిటీ సభ్యులు, పాఠశాల సిబ్బంది

ప్రభుత్వ పాఠశాలలో అల్లూరి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థి పాలపర్తి సత్యానందం ఆర్థిక సహకారంతో అల్లూరి సేవా కమిటీ అధ్యక్షుడు లక్కాకుల బాబ్జీ దీనిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు బాలరాజు, సత్యనారాయణ, శ్యామల వరలక్ష్మి పాల్గొన్నారు.

బిజెపితో ప్రభుత్వ రంగం ధ్వంసం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలనూ కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం కోసం వాటిని ధ్వంసం చేస్తోందని సిఐటియు జిల్లా నాయకులు వై.రాజు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 694వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ప్రభుత్వ రంగ సంస్థలు ఎంతో కీలకపాత్ర నిర్వహిస్తున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానిక సంస్థలకు వివిధ రకాల పన్నుల రూపంలో వీటి ద్వారా గణనీయంగా ఆదాయం లభిస్తోందన్నారు. అయినప్పటికీ వాటిని ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలులో ఉండే రిజర్వేషన్లను ప్రైవేటీకరణతో కోల్పోవలసి ఉంటుందన్నారు. ఇదే జరిగితే దళిత, గిరిజన వంటి అణగారిన తరగతులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయన్నారు. దీక్షల్లో కె.నర్సింగరావు, కె.సంతోష్, సిహెచ్.రామారావు, పి.ఈశ్వరరావు, కెవిపి.చంద్రమౌళి పాల్గొన్నారు.

పలు ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవిలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు సేవలను ముందుకుతెచ్చింది. ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా 08579 విశాఖపట్నం - సికింద్రాబాద్ వీక్లీ స్పెషల్ రైలు మార్చి 1 నుంచి 26 వరకూ ప్రతి బుధవారం సాయంత్రం 19.00 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. 08580 సికింద్రాబాద్ - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు మార్చి 2 నుంచి 27 వరకు ప్రతి గురువారం సాయంత్రం 19.40 గంటలకు సికింద్రాబాద్ నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08585 విశాఖపట్నం - మహబూబ్‌నగర్ వీక్లీ స్పెషల్ రైలు మార్చి 7 నుండి 25 వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 17.35 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటుంది. 08586 మహబూబ్‌నగర్ - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు మార్చి 8 నుండి 26 వరకు వరకు ప్రతి బుధవారం సాయంత్రం 18.20 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. 08583 విశాఖపట్నం - తిరుపతి వీక్లీ స్పెషల్ రైలు మార్చి 6 నుంచి 24 వరకూ ప్రతి సోమవారం సాయంత్రం 19.00 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. 08584 తిరుపతి - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ మార్చి 7 నుంచి 25 వరకూ ప్రతి మంగళవారం రాత్రి 21.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. 08543 విశాఖపట్నం-బెంగుళూరు కాంట్ వీక్లీ స్పెషల్ రైలు మార్చి 5 నుండి ఏప్రిల్ 30 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 15.55 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.15 గంటలకు బెంగళూరు కాంట్ చేరుకుంటుంది.

పార్వతమ్మకు అంతిమ వీడ్కోలు

తిమ్మరాజుపేటకు వందలాది మంది రాక
కన్నీటి సంద్రంగా జన హృదయాలు
నివాళ్లర్పించిన బివి.రాఘవులు, సిహెచ్.నర్సింగరావు, ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి - అచ్యుతాపురం : సిపిఎం సీనియర్ నాయకురాలు, పోరాట యోధురాలు కర్రి పార్వతమ్మ అంతిమ యాత్ర వందలాది మందితో శుక్రవారం సాగింది. ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంతిమ యాత్ర అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట గ్రామంలోని ఆమె స్వగృహం నుంచి ప్రారంభమైంది. తొలుత ఆమె పార్థివదేహం వద్ద సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, తదితరులు నివాళ్లర్పించారు. ఆమె కుటుంబ సభ్యులు కర్రి సుందరయ్య, స్వామి బాబు, రూపవతి, సుగుణ, కాంచన, విప్లవ సంస్కృతి తదితరులను పరామర్శించి ఓదార్చారు. పార్టీకి చేసిన సేవలను, ఆమె పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పార్వతమ్మ పోరాటాలను గుర్తు చేస్తూ ప్రజానాట్యమండలి గాయకులు పలు గేయాలను ఆలపించారు. సంతాప సభలో పార్వతమ్మ ఉద్యమ ప్రస్థానాన్ని వక్తలు తెలిపారు. ఆమె మృతి సిపిఎంకు తీరని లోటుగా భావించారు. ఆమె అడుగుజాడల్లో ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ నడుంబిగించి పనిచేయాలని ప్రతినబూనారు. పార్వతమ్మ కుటుంబానికి అండదండగా ఉంటామని భరోసా పలికారు. పార్వతమ్మ పార్టీకీ, ప్రజలకూ చేసిన సేవలు ఎన్నటికీ మరువలేమన్నారు. అనంతరం తిమ్మరాజుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, గ్రామ సచివాలయం మీదుగా ఓవర్ హెడ్ ట్యాంక్ వరకూ, అక్కడ నుంచి స్వర్గధామం శ్మశాన వాటిక వరకూ అంతిమయాత్ర సాగింది. ఆయా కార్యక్రమాల్లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, సిఐటియు నాయకులు ఆర్.శంకరరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాసరావు, ఆర్.రాము, వివి.శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు, ఐద్వా నాయకులు బి.పద్మ, సుమిత్ర, శేషారత్నం, పలువురు ప్రముఖులు ఎస్‌వికె.పరశురాం, రమణాజీ, అచ్యుతాపురం మండలాధ్యక్షులు కోన బుజ్జి, మాజీ సర్పంచ్ బి.రాందాస్, బిసి సెల్ నాయకులు కర్రి ఆదిబాబు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి, ప్రజానాట్యమండలి నాయకులు గుర్రం రమణ, రామ్‌కుమార్, ఆత్మారామ్ పాల్గొన్నారు.

పార్వతమ్మ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు

సంతాప సభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

పార్వతమ్మ పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న రాఘవులు, లోకనాథం, తదితరులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

ప్రజశక్తి-రాజవొమ్మంగి

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని దూసరపాము గ్రామంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ప్రజలు దౌర్భాగ్య పరిస్థితి అనుభవించారని తెలిపారు. అనంతరం మండలంలోని నియమించబడ్డ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సొసైటీ ఛైర్మెన్ సింగిరెడ్డి రామకృష్ణ, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, దూసరపాము సర్పంచ్ చీడి శివ, ఎంపీటీసీలు కె గంగాదుర్గ, సీహెచ్ చంద్ర రాణి, వైసీపీ నాయకులు సీహెచ్ అప్పారావు, ఎ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ వ్యతిరేక కార్యకలాపాల సమర్థనకే రవిబాబుకు ఎమ్మెల్సీ పదవి

ప్రజాశక్తి-సీలేరు : ఆదివాసీ వ్యతిరేక కార్యకలాపాలను సమర్థించినందుకే ప్రభుత్వం ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కుంభ రవిబాబుకు ఎమ్మెల్సీ పదవిని బహుమానంగా ఇచ్చిందని ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ ఛైర్మన్ మొట్టడం రాజబాబు, జిల్లా కన్వీనర్ రామారావు దొర ఎద్దేవా చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీలకు, ఎస్టీలకు విడివిడిగా కమిషన్ ఏర్పాటు చేసి ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతానికి చెందిన ఆదివాసీకి ఛైర్మన్ పదవి ఇస్తామని చెప్పిన జగన్, నాన్ షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనుడైన కుంభ రవిబాబుకు ఛైర్మన్ పదవిని కట్టబెట్టారని తెలిపారు. రవిబాబు బోగస్ గిరిజనులకు, కృత్రిమ గిరిజనులకు ఉపయోగపడ్డాడు తప్పా నిజమైన ఆదివాసీలకు ఉపయోగపడలేదని ఆరోపించారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలవంతులై బీసీల్లో ఉన్న బోయ వాల్మీకులను, ఒడిశా బ్రాహ్మణులైనా బెంతి ఒరియాలను గిరిజన జాబితాలో కలుపుతమన్న ప్రభుత్వ నిర్ణయాన్ని రవిబాబు వ్యతిరేకించలేదని పేర్కొన్నారు. జిఒ 3పై రివ్యూ పిటిషన్ వేయడానికి కృషి చేయలేదని, హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణాలకు కేబినెట్ నిర్ణయంపై రవిబాబ కనీసం మాట్లాడలేదని పేర్కొన్నారు. ఆదివాసీ ఎంపీ, ఎమ్మెల్యేలను దెప్పి పొడిచిన రవిబాబు, ఐదవ షెడ్యూల్డ్‌లో భూ ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోలేదని ఆరోపించారు.

ఆర్ఎసి విభాగంలో మార్కెట్ వాటాపై హిటాచి దృష్టి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రానున్న వేసవి సీజన్‌లో భారత దేశ ప్రీమియం ఎయిర్ కండిషనర్ బ్రాండ్ హిటాచి కూలింగ్ అండ్ హీటింగ్ తయారీదారు ఆర్ఎసి కేటగిరీలో మార్కెటింగ్ వాటాలపై దృష్టి సారించి ముందుకు సాగుతోందని జాన్సన్ కంట్రోల్స్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ఎమ్‌డి గుర్మీత్ సింగ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ప్రథమార్థంలో పది శాతం కంటే ఎక్కువ మార్కెట్ వాటాను సాధించడంతోపాటు 25 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎయిర్ హోం సిరీస్ ఉత్పత్తి డిజైన్ అవార్డు కూడా తాము గెలుచుకున్నట్లు తెలిపారు. 15 శాతం విద్యుత్ ఆదాతో సురక్షితమైన, పరిశుభ్రమైన ఇండోర్ వాతావరణాన్ని హిటాచి అందిస్తుందని హామీ ఇచ్చారు.

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మార్చి 3, 4 తేదీలలో నగరంలోని ఆంధ్ర యూనివర్సిటీ మైదానంలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పోలీసు అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సదస్సు జరిగే ప్రాంతాలను, విఐపిలూ, పారిశ్రామిక వేత్తలూ సందర్శించే ప్రాంతాలను విస్తృతంగా తనిఖీ చేశారు.